ఆంధ్రజ్యోతి



నంద్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 1 జూలై 2025

డీఎస్సీ పరీక్షలకు 29 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో సోమవారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షకు 29 మంది గైర్హాజరయ్యారు. మొదటి సెషన్‌లో ఎస్ఏ(లాంగ్వేజి) తెలుగు పరీక్షకు మొత్తం 91మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 64మంది అభ్యర్థులు హాజరై 29మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

గుట్టుగా..!

విద్యుత్ సిబ్బంది చేతివాటం

- మరమ్మతుల మాయాజాలం
- అక్రమార్కులకు కాసుల వర్షం
- రైతులపై పెనుభారం
- నిబంధనలకు తూట్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

విద్యుత్ శాఖలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. అన్నదాతకు శాపంగా మారుతోంది. సిబ్బంది, కాంట్రాక్టర్లు కుమ్మక్కై తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రభుత్వ వాహనాల్లో తరలించాల్సిన నిబంధన ఉంది. దీనికి తూట్లు పొడుస్తున్నారు. రైతులు సమస్యను తెలిపితే సకాలంలో స్పందించడం లేదు. విసిగి వేసారిన అన్నదాతలు ప్రైవేటు వాహనాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను తరలించి వారే తీసుకెళ్తున్నారు. కానీ విద్యుత్ సిబ్బంది మాత్రం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రభుత్వ వాహనంలో ట్రాన్స్‌ఫార్మర్లు తెచ్చినట్లు రికార్డుల్లో రాసుకుంటున్నారు. లక్షలకు లక్షలు బిల్లు పెట్టుకొని అక్రమార్జనకు శ్రీకారం చుడుతున్నారు. ఇంత తంతంగం జరుగుతున్నా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం

నంద్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు కుమ్మక్కై తమదైన శైలిలో గుట్టుగా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా కొందరు విద్యుత్‌శాఖ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. ప్రధానంగా నిబంధనల ప్రకారం.. వ్యవసాయ పొలాలకు సంబంధించి ఎక్కడైన హై ఓల్టేజీ.. ఇతరత్రా కారణాలతో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైతే వెంటనే సంబంధిత విద్యుత్‌శాఖ ఉద్యోగులు తమ వాహనాల్లో తరలించి సకాలంలో సదరు రైతు సమస్యను పరిష్కారించాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో సదరు నిబంధన ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదు. ఫలితంగా రైతులపై ఆర్థికబారం పడుతోంది. వీటికితోడు కొన్నిప్రాంతాల్లో సిబ్బంది మరీ దారుణం. రైతులు తమ దృష్టికి తెచ్చినా ఏమాత్రం స్పందించకపోవడం.. నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కొంద రైతే పైసలిస్తే తప్ప కదలడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. దీంతో చేసేదీ లేక బాధిత రైతులే నేరుగా అద్దె వాహనాల ద్వారా తీసుకెళ్లాల్సిన దుస్థితి. ఈ క్రమంలో ఇదే అదునుగా భావించి విద్యుత్‌శాఖ వాహనంలో తరలించినట్లు రికార్డుల్లో నమోదు చేసి తమదైన శైలిలో దండుకుంటున్నారు. ఏదీ ఏమైనా సిబ్బంది నిర్లక్ష్యం.. ఆశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం కారణంగా.. ఆయా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తుంటే.. రైతులకు మాత్రం శాపంగా మారింది.

నిబంధనలు భేఖాతరు..

క్షేత్రస్థాయిలో రైతుల పొలాల్లో ఎక్కడైన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైతే వెంటనే ఆశాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలి. అదీ కూడా పట్టణ ప్రాంతాల్లో అయితే 12 గంటలు, గ్రామీణా ప్రాంతాల్లో అయితే 24 గంటల్లో సమస్యను పరిష్కారించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా కూడా ఆశించినస్థాయిలో సదరు నిబంధన అమలు కావడం లేదు. రైతు సమాచారం ఇవ్వగానే.. సంబంధిత విద్యుత్‌శాఖ ఉద్యోగులు తమ వద్ద ఉన్న పనిచేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను తమ శాఖ వాహనంలో బాధిత రైతు పొలం వద్దకు తీసుకెళ్లి అమర్చాలి. ఆ తర్వాత మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను అదే వాహనంలో వెనక్కి తీసుకెళ్లాల్సి ఉంది. ప్రధానంగా కొన్నిచోట్లయితే.. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికాగానే.. సిబ్బందికి తెలియ జేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని సమాచారం. ఒకవేళ స్పందించినా శాఖ వాహనం అందుబాటులో లేదని చెప్పి మమ అనిపించేస్తున్నారని సమాచారం. దీంతో చేసేదేమీ లేక పంటను ఎండబెట్టకోలేక.. ఎక్కువ మంది రైతులు అద్దె వాహనాల్లో తీసుకెళ్లాల్సిన దుస్థితి. బాధిత రైతులపై ఆర్థిక బారం పడినట్లైంది. ఇదిలా ఉండగా.. ఇలాంటి వ్యవహారాలపై ఆశాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. ఇంకెముందీ సదరు అక్రమార్కుల ఆడిందే.. ఆట.. పాడిందే పాట అన్నట్టు.. వ్యవహరించి తెర వెనుక క్యాష్ చేసుకున్నట్లైంది.

జిల్లాలో ఆరు మరమ్మతు కేంద్రాలు

అధికార లెక్కల ప్రకారం జిల్లాలో ఆరు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఒకటి మాత్రమే విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. మిగిలిన ఐదు ప్రైవేట్ వ్యక్తుల ద్వారా (కాంట్రాక్టు) నడుస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్ల రైతులు అద్దె వాహనాల్లో తెస్తున్నారని తెలిసింది. వీటిని కూడా సదరు కాంట్రాక్టర్లు తమ శాఖ వాహనాల్లో తెచ్చినట్లు రికారుల్లో నమోదు చేసుకుని నెలకు రూ. లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది.



ఉద్యోగులు స్పందించకపోతే తమ దృష్టికి..



రైతుల పొలాలకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం సకాలంలో సమస్యను పరిష్కరించాలి. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా శాఖ వాహనంలోను తీసుకురావాలి. ఏదైనా విద్యుత్ సమస్య ఏర్పడిన వెంటనే 1912 ఫోన్ చేసి సమస్యను తెలియజేయండి. ఎవరైనా ఉద్యోగులు స్పందించపోతే తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

● సుధాకర్ కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

వెబ్ ఆప్షన్ నమోదు ప్రారంభం

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా కళాశాలలను, బ్రాంచ్‌లను ఎంపిక చేసుకోవడానికి వెబ్ ఆప్షన్ నమోదును సోమవారం నుంచి జూలై 5వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్ తెలిపారు. 30వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు 1వ ర్యాంక్ నుంచి 50,000 ర్యాంక్ వరకు, 2, 3వ తేదీల్లో 50001 నుంచి 90,000వ ర్యాంక్ వరకు, 4, 5వ తేదీల్లో 90,001 నుంచి చివరి ర్యాంక్ వరకు వెబ్ ఆప్షన్ నమోదుకు అవకాశం కల్పించారు. జూలై 6వ తేదీన వెబ్ ఆప్షన్ల మార్పు, 9వ తేదీన సీట్ల కేటాయిస్తామన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు జూలై 10 నుంచి 14వ తేదీలోపు కళాశాలల్లో చేరాలని, 10వ తేదీ నుంచే కళాశాలలు ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి: కలెక్టర్


కలెక్టర్ రాజకుమారి

నంద్యాల టౌన్ జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని, ఇందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సెంటినర్ హల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన ఫిర్యాదులపై ఎవరు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఇక్కడికి వచ్చే దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్, ర్యాంపు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. పీ 4 సర్వేలో భాగంగా జిల్లాలో 42 వేల మంది బంగారు కుటుంబాలు 2800 మంది చెంచు కుటుంబాలు ఉన్నాయని వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమానికి 284 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జేసీ విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేరాలతో ప్రేమానురాగాలకు దూరం

మూడో అదనపు జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా


మాట్లాడుతున్న న్యాయాధికారి అమ్మన్న రాజా

నంద్యాల క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో చేసిన నేరాలతో కుటుంబసభ్యుల ప్రేమానురాగాలు కోల్పోతామని మూడో అదనపు జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా అన్నారు. సోమవారం పట్టణంలోని సబ్ జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలు పరిసరాలను, జైలు గదులను, వంటశాలను, స్నానపు తదితర గదులను పరిశీలించి సూచనలిచ్చారు. ఖైదీల ఆరోగ్య విషయం, వారి కేసుల వివరాలను ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని ఆవేశాలకు గురికాకుండా, తప్పుడు పనులకు దూరంగా ఉండాలని ఖైదీలకు సూచించారు. సబ్ జైల్ సూపరింటెండెంట్‌కు ఆయన సూచనలు, సలహాలు ఇచ్చారు. జైలర్ గురుప్రసాద్‌రెడ్డి, న్యాయవాది నాయక్, లోక్‌అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ రద్దుకు పోరాడదాం

● తెలంగాణ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

7

కందనవోలుది ఘనకీర్తి

కర్నూలు జిల్లాకు 167 ఏళ్లు



రాయలసీమ ముఖద్వారం కర్నూలు.. రాజులు, చక్రవర్తులు, నవాబులు, పాలేగాళ్లు పాలించిన నేల ఇది. బ్రిటీష్ పాలకులు భరత గడ్డపై అడుగు పెట్టాక వారి పెత్తనాన్ని సవాల్ చేస్తూ తొలి తిరుగుబాటుకు బీజం వేసిన ఘనచరిత్ర మనది. పాలేగాళ్ల పాలనకు స్వస్తి చెప్పాలని రాయలసీమ జిల్లాలను దత్త మండలాలుగా ప్రటించారు. పాలన సౌలభ్యం కోసం బ్రిటీష్ పాలకులు జిల్లాలను ఏర్పాటు చేశారు. మొదట కడప, బళ్లారి జిల్లాలు ఉండేవి. ఆ తరువాత కర్నూలు జిల్లా 1858 జూలై 1న ఆవిర్భవించింది. నేటితో 167 వసంతాలు పూర్తి చేసుకున్న కర్నూలు జిల్లా ఘనచరిత్రపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- 1858లో జిల్లాగా ఆవిర్భావం
- ఆంధ్ర రాష్ట్ర మొదటి రాజధాని కర్నూలు
- మార్కాపురం, కంభం, ఎర్రగొండపాలెం కందనవోలులో భాగమే
- ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు 1953లో కర్నూలు జిల్లాలో విలీనం
- నేటి కేఎంసీ ఫోరెన్సిక్ భవనమే నాటి కలెక్టర్ బంగ్లా
- ప్రప్రథమంగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలు జిల్లా వాసులే
- తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య మనవారే
- నేడు కర్నూలు జిల్లా ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పాలకులు దత్త మండలాల(రాయలసీమ జిల్లాలు)ను 1801లో కడప, బళ్లారి రెండు జిల్లాలుగా చేశారు. ప్రస్తుత ఉమ్మడి కర్నూలు జిల్లా సగ భాగం కడపలో, మరో సగభాగం బళ్లారి జిల్లాలో ఉండేవి. అంతకుముందు 1800 నవంబరు 1న థామస్‌మన్రో దత్త మండలాలకు ప్రధాన కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఆతరువాత నాలుగు జిల్లాలుగా ఏర్పాటు చేశారు. 1858లో కడప జిల్లా నుంచి విడిపోయి కర్నూలు జిల్లా, బళ్లారి జిల్లా నుంచి కొంత భాగం విడదీసి అనంతపురం జిల్లాను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ విభాగం నిర్వహిస్తున్న భవనమే కర్నూలు జిల్లా తొలి కలెక్టర్ బంగ్లా. కర్నూలు, నందికొట్కూరు, రామళ్లకోట, పత్తికొండ, నంద్యాల, శిరువెళ్ల, మార్కాపురం, కంభం తాలుకాలు కలిపి కర్నూలు కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం వచ్చే వరకు జిల్లా స్వరూపంలో ఏ మార్పు రాలేదు. స్వాతంత్ర్యం తరువాత కూడా బనగానపల్లె సంస్థానం కొన్నాళ్లు స్వతంత్రంగానే ఉన్నా.. 1948 సెప్టెంబరు 18న కర్నూలు జిల్లాలో అంతర్భాగం అయ్యింది. 1953లో మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి.. కర్నూలు రాజధాని కేంద్రంగా ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించింది. అదే ఏడాది అక్టోబరు 1న బళ్లారి జిల్లా నుంచి ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు తాలుకాలను విడదీసి కర్నూలులో విలీనం చేశారు. అయితే.. రాయలసీమ (దత్త మండలాలు)లో భాగమైన బళ్లారిని కోల్పోక తప్పలేదు.





జిల్లాల పునర్విభజన తరువాత..

కేంద్ర ప్రభుత్వం 1971లో జిల్లాలు పునర్విభజన చేశారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న మార్కాపురం, గిద్దలూరు, కంభం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలు ప్రకాశం జిల్లాలో కలిపేశారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, నందికొట్కూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, కోవెలకుంట్ల, బనగానపల్లె, డోన్ నియోజకవర్గాలతో కర్నూలు మిగిలింది. నియోజకవర్గాల పునర్విభజనతో కోవెలకుంట్ల కనుమరుగై పాణ్యం, మంత్రాలయం నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. ఆత్మకూరు స్థానంలో శ్రీశైలం నియోజకవర్గం వచ్చింది. 2022లో జిల్లాల పునర్విభజనతో 167 ఏళ్ల పాటు కర్నూలు జిల్లాలో అంతర్భాగంగా ఉన్న నంద్యాల కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడింది. కర్నూలు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గంలోని రెండు మండలాలలో కర్నూలు జిల్లా మిగిలింది. నంద్యాల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాలతో నంద్యాల జిల్లా ఏర్పడింది.

తొలి తిరుగు బాటు..

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటీష్ పాలకుల వార్ రూంలోకి మన జిల్లాకు చెందిన రాజ నీతిజ్ఞుడు ఆర్కాట్ రామస్వామి మొదిలియర్ ఆహ్వానం పలికారు. జిల్లాకు చెందిన తెర్నేకల్లు ముత్తుకూరు గౌడప్ప, కర్నూలు నవాబు గులాం రసూల్‌ఖాన్, పాలేగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా తొలి తిరుగుబాటు చేశారు. 1908లో జిల్లాకు చెందిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు బ్రిటీష్ పాలకులు తొలి రాజకీయ ఖైదీగా అరెస్టు చేశారు. స్వాతంత్ర్యం తర్వాత కర్నూలు చెందిన సర్దార్ నాగప్ప రాజ్యంగ సభకు ఎన్నికై రాజ్యాంగ నిర్మాణంలో సభ్యుడు అయ్యారు.

మిగతా 7వ పేజీలో

'లీజు' పేరిట కన్నేశారు..!


కర్నూలు కలెక్టరేట్ వద్ద వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి డి-పట్టా రైతుల ఆందోళన

- మూడు తరాలుగా సాగులో నిరుపేదలు
- 2005లో 276 ఎకరాలకు డి-పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం
- ఇరవై ఏళ్ల తరువాత ఆ భూముల్లో లీజు పేరిట వాలిన గద్దలు
- కర్నూలు కలెక్టర్‌ను ఆశ్రయించిన పుల్లగుమ్మి పేద రైతులు

కర్నూలు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మూడు తరాలుగా నిరుపేదల సాగులో ఉన్న ప్రభుత్వభూములు అవి. వివిధ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సాగు పట్టాలు ఇచ్చి భూయాజమాన్య హక్కు కల్పించాలని దశాబ్దాలుగా పాలకులను విన్నవిస్తున్నారు. 2005లో ఆనాటి ప్రభుత్వం సాగులో ఉన్న నిరుపేదలను గుర్తించి దాదాపు 276 ఎకరాలు 200 మందికి రైతులకు డి-పట్టాలు ఇచ్చి పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారు. లబ్ధిదారులు బ్యాంకుల్లో పంట రుణాలు కూడా పొందారు. ఆ భూముల్లో సేద్యం చేస్తూ.. కూలీ పనులు చేసుకుంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్న పేదల గుండెల్లో 'లీజు' గునపం దింపేస్తున్నారు. ఈ భూముల్లో మాకు మైనింగ్ లీజులు ఉన్నాయి.. ఖాళీ చేయాల్సిందే అంటూ పెద్దలు గద్దల్లా వాలిపోయారు. దిక్కుతోచని డి-పట్టా రైతులు న్యాయం చేయాలంటూ సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయించారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు ఫిర్యాదు చేశారు. 'తాతల కాలం నుంచి మూడు తరాలుగా ఆ భూముల్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం.. ఇరవై ఏళ్ల తరువాత వచ్చి లీజు ఉంది.. ఖాళీ చేయాలనడం ఎంత వరకు న్యాయం..? అంటున్న పేద రైతుల కన్నీటి వేదన ఇది.


డి-పట్టా భూముల్లో రైతులు సాగు చేస్తున్న పంటలు

కర్నూలు జిల్లా కల్లూరు మండలం యాపర్లపాడు రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 238/ఏ పరిధిలో సుమారు 1,500 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి.

మిగతా 7వ పేజీలో

విచారణ జరిపి న్యాయం చేయండి

● ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

● పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 160 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశించారు. సోమవారం పోలీసు ప్రజా సమస్యల ఫిర్యాదు వేదికకు 160 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుల్లో ఎక్కువగా కుటుంబ కలహాలు, పొలం తగదాలు వస్తున్నాయని అన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలానికి చెందిన దాసరి చిన్న రవికి కొలిమిగుండ్ల మండలం కంబవారిపల్లెకు చెందిన వడ్డె శంకర్‌నారాయణ రైల్వేలో టీసీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.14 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఆస్తులను కాపాడాలి

● మున్సిపల్ సమావేశంలో కమిషనర్ బండి శేషన్న



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నీసా, పాల్గొన్న సభ్యులు, అధికారులు

నంద్యాల టౌన్ జూన్30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ ఆస్తులను కాపాడాలని, అందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరం అని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. సోమవారం స్థానిక పురపాలక సంఘంలో సాధారణ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన కమిషనర్ పరిచయం చేసుకున్నారు. అనంతరం సభను ప్రారంభించి అజెండాను సభ్యుల ముందు ప్రవేశపెట్టారు. పద్మావతి నగర్ ఆర్చి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఉన్న కాల్వలు శుభ్రం చేయడానికి రూ.10 కేటాయించడంపై వైస్ చైర్మన్ పాంశావలి అభ్యంతరం వ్యక్తంచేశారు. పట్టణంలోని అన్ని వార్డులను కేవలం రూ.2 లక్షలు కేటాయించి కేవలం వార్డులో 25 శాతం ఉన్న పద్మావతినగర్ కు 10 లక్షలు కేటాయించడం ఎంటనీ అన్నారు. ఇందుకు సమాధానంగా ఎంఈ గురప్ప మాట్లాడుతూ.. పద్మావతి నగర్‌లోని లింక్ కాల్వలు కూడా చేస్తామని చెప్పారు. సమావేశానికి, అజెండాలో చేర్చే సమయం లోనే పూర్తి వివరాలు చేర్చాలన్నారు. అనంతరం ఎన్జీవో కాలనీ కౌన్సిలర్, మాజీ చైర్‌పర్సన్ దేశం సులోచన మాట్లాడుతూ.. డిజిల్ విషయంలో పారిశుధ్య విభాగం వారు బలవంతంగా డ్రైవర్ల చేత ఎక్కువగా డిజిల్ నడిపినట్లు సంతకాలు తీసుకుంటున్నారని కౌన్సిల్ సమావేశంలో తెలిపారు. లేనిపోని లెక్కలు రాసి డబ్బులు తీసుకుంటున్నట్లు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో కమిషనర్ పారిశుధ్య సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి ప్రతిపని ఎలా చేస్తున్నామని కౌన్సిల్ ముందు పెట్టాలని సూచించారు. అలాగే పట్టణంలో పాగింగ్, కాల్వలు శుభ్రం చేయడంలో నిర్లక్ష్యంగా ఉందని కౌన్సిల్ సభ్యులు తెలిపారు. నూతనంగా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పారిశుధ్య కార్మికులను 60 నెల రోజులకు ఒప్పంద పద్ధతిలో తీసుకుంటున్నట్లు తీర్మాణం చేశారు. అలాగే పట్టణంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేసి బిల్లు పాస్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు తన్మయిశ్రేయ

నంద్యాల హాస్పిటల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు నంద్యాలకు చెందిన పబ్బతి తన్మయిశ్రేయ అర్హత సాధించినట్లు ఫెన్సింగ్ కోచ్ లక్ష్మణ్ తెలిపారు. విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-10 ఫెన్సింగ్ చాంపియన్ షిప్‌లో పబ్బతి తన్మయిశ్రేయ రజత పతకం సాధించిందన్నారు. జూలై 5, 6, 7తేదీల్లో ఒరిస్సాలో జరిగే జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని తెలిపారు. ఎంపికైన తన్మయిశ్రేయను శిక్షకుడు మహేష్, లక్ష్మణ్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

కౌన్సిల్‌లో మూడు తీర్మానాలు ఆమోదం

ఆత్మకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో సోమవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సభలో మూడు తీర్మానాలను ఆమోదించారు. ఇందులో ఏఎస్‌సీ గ్రాంట్‌కు సంబంధించి రూ.32.54లక్షలతో తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్, బోరుబావులు, మోటార్ల ఏర్పాటుకు సంబంధించిన 7వర్క్‌లను ఆమోదించారు. అలాగే రూ.1.64లక్షల సాధారణ నిధులతో గుండ్లకాల్వ పరిధిలో పూడికతీత పనులకు సంబంధించి 2 వర్క్‌లకు అంగీకరించారు. అదేవిధంగా 15వ ఆర్థిక ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా రూ.23.3లక్షల చేపట్టనున్న రెండు సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు ఉన్నారు.

రహదారి నిర్మాణానికి భూమి పూజ

మహానంది, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మసీదు పురం గ్రామం నుంచి కర్నూలు-కడప హైవే రహదారి వరకు రూ.90 లక్షలతో నిర్మాణ పనులకు సోమవారం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి భూమి పూజ చేశారు. అధ్వానంగా ఉన్న రోడ్డు మరమ్మతులకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి నిధు లు విడుదల చేయించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓ.ప్రతాపరెడ్డి, దినేష్‌రెడ్డితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదని ఆలయ ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆలయ సుందరీకరణలో భాగంగా సోమవారం క్షేత్ర పరిధిలో దేవతావృక్షాలైన బిల్వం, కదంబం, రుద్రాక్ష, తెల్లమద్ది, ఉసిరి, రావి, మేడి, వేప మొక్కలను నాటారు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, ఉద్యాన అధికారులు ఈశ్వరరెడ్డి, లోకేశ్‌లతో పాటు ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సేవలు చిరస్మరణీయం: ఎస్పీ



పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానించిన ఎస్పీ

నంద్యాల టౌన్ జూన్30(ఆంధ్రజ్యోతి): పోలీసులుగా పని చేస్తూ ఉత్తమ సేవలు అందించడం ఎంతో అభినందనీయం, వారి సేవలు చిరస్మరణీయం అని నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. సోమవారం నంద్యాల జిల్లాలో పదవి విరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఆయన స్థానిక జిల్లా కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారి ఆరోగ్యాన్ని కాపాడుతూ.. సేవలు అందించడండం సంతోషంగా ఉందన్నారు. పదవి విరమణ పొందిన తర్వాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని అన్నారు. అనంతరం వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్యనారాయణ ఎస్సై దొర్నిపాడు, ఎస్సై దేవేంద్ర కుమార్ త్రీటౌన్ నంద్యాల, వెంకట సుబ్బయ్య ఎస్సై, జారప్ప రిజర్వుడ్ హెడ్‌కానిస్టేబుల్ పదవి విరమణ పొందినట్లు తెలిపారు. అంనతరం వారి కుటుంబ విషయాలు అడిగి తెలసుకుని వారిని సన్మానించారు.

ఆందోళనలకు సిద్ధం కండి

నందికొట్కూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ప్రజలను ఆందోళనలకు సిద్ధం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు లాంటి కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై ప్రజల్ని సమీకరించి సచివాలయాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, పక్కీర్ సాహెబ్, మద్దిలేటి, రంగమ్మ, హుస్సేనమ్మ, ఓబులేసు, రామకృష్ణ, రాము, మధు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ భూమిని సర్వే చేయండి

జూపాడుబంగ్లా, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగెడంచలోని మత్స్యశాఖకు చెందిన చేప పిల్లల గుడ్డు ఉత్పత్తి కేంద్రం అన్యాక్రాంతమవుతున్న భూమిని సర్వే చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 1990లో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖకు మత్స్య సంపదను ఉత్పత్తి చేయడానికి 7 ఎకరాల స్థలం కేటాయించారని, కొందరు వ్యక్తులు భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని సర్వే చేసి మత్స్యశాఖకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించి, తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, నరసింహులు, ఏసన్న, శివకుమార్, బీబీ, లక్ష్మీదేవి, మల్లమ్మ పాల్గొన్నారు.

టీడీపీలో పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం



మాట్లాడుతున్న ఆత్మకూరు మండల టీడీపీ పరిశీకులు చాబోలు ఇలియాస్

ఆత్మకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): టీడీపీలో పనిచేసే కార్యకర్తలకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని ఆత్మకూరు మండల టీడీపీ పరిశీకులు చాబోలు ఇలియాస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ ముఖ్యనాయకులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రం సర్వనాశనమైందని ఈ పరిస్థితుల్లో రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంంలో టీడీపీ మయండల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్, నాయకులు నబిరసూల్ తదితరులు ఉన్నారు.

బీజేపీని బలోపేతం చేస్తాం



మానపాటి శ్రీనివాసగౌడ్‌ను కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు

నందికొట్కూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీని బలోపేతం చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా.అభిరుచి మధు అన్నారు. సోమవారం సాయంత్రం నందికొట్కూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మానపాటి శ్రీనివాస గౌడ బీజేపీలో చేరారు. పట్టణంలోని బసిరెడ్డి కళాశాల నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానపాటి శ్రీనివాస గౌడ తమ కులవృత్తి అయిన గొర్రెపొల్లను, కర్రను, కంబళ్లిని అభిరుచి మధుకు బహూకరించారు. అనంతరం అభిరుచి మధు మానపాటి శ్రీనివాస గౌడకు బీజేపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మధు మాట్లాడుతూ రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో అనుసంధానంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కూడా బరిలో దిగేందుకు పార్టీని బలోపేతం చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతుల సంక్షేమమే టీడీపీ ధ్యేయం



ఎమ్మెల్యే గౌరుచరితకు పుష్పగుచ్చం అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు

గడివేముల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి అన్నారు. గడివేముల సొసైటి చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరుచరితను కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అండగా ఉండి వారి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సహకార సంఘం నుంచి రైతులకు సకాలంలో ఎరువులు, రుణాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరేంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారి

- రెండు గంటల్లోనే తల్లిదండ్రుల వద్ద చేర్చిన పోలీసులు



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అర్బన్ సీఐ రాము

ఆత్మకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఓ మూడేళ్ల బాలుడు తప్పిపోగా పోలీసులు రెండు గంటల వ్యవధిలోనే కేసు ఛేదించినట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ రాము తెలిపారు. వివరాలు.. పట్టణంలోని ఆసర్ మసీద్ సమీపంలో లారీ డ్రైవర్ కలీమ్ నివాసం ఉంటున్నాడు. అతడికి మూడేళ్ల వయస్సు గల కాసీఫ్ అనే కుమారుడు ఉన్నాడు. సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయి పాతబస్టాండ్ వరకు చేరుకున్నాడు. అక్కడ తన తల్లిదండ్రులు ఎవరూ కనిపించకపోవడంతో చిన్నారి ఏడుస్తూ ఉన్నాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీ సులకు సమాచారమిచ్చారు. బ్లూకోట్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని బాలుడిని పోలీ సుస్టేషన్‌కు తీసుకెళ్లారు. సీఐ రాము రెండు పోలీసు బృందాలను ఏర్పాటుచేసి పట్టణంలో ఆరాతీశారు. ఎట్టకేలకు అప్పటికే బాలుడి ఆచూకీ కోసం ఎదురు చూస్తున్న కలీమ్ కుటుంబీకులు తమ పిల్లవాడు తప్పిపోయాడని అక్కడికి వచ్చిన పోలీసులకు చెప్పారు. బాలుడి తల్లిదండ్రులను సీఐ పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారించి చిన్నారిని అప్పగించారు.

రాష్ట్ర స్థాయి పెన్యాక్ సిలాట్ పోటీలు



పతకాలు సాధించిన విజేతలతో నిర్వాహకులు

నంద్యాల హాస్పిటల్, జూన్ 30(ఆంధ్ర జ్యోతి): నంద్యాల పట్టణంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఆదివారం 13వ రాష్ట్ర స్థాయి పెన్యాక్ సిలాట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా జిల్లా పెన్కాక్ సిలాట్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖరరెడ్డి, సౌత్‌జోన్ కార్యదర్శి మనోజ్ సాయి పాల్గొన్నారు. నంద్యాల జిల్లా పెన్యాక్ సిలాట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రధానకార్యదర్శి నూర్‌బాషా ఈ పోటీలు నిర్వహించారు. తుంగల్, ట్యాండింగ్, రేగు, గండ, సోలో విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని సత్యసాయి, గుంటూరు, ఒంగోలు, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన దాదాపు వందమంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నట్లు కార్యదర్శి నూర్‌బాష తెలిపారు. అనంతరం విజయం సాధించిన క్రీడాకారులకు బంగారు, వెండి పతకాలతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు.

శ్రీశైలంలో నిత్యాన్నదానానికి విరాళాలు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం నిత్యాన్న దానానికి పలువురు విరాళాలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కుమారస్వామిరెడ్డి అనే భక్తుడు రూ.1.00,116లు, కర్నాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన అమిత్‌కుమార్ మన్నూర్ రూ.1,00,000లు, హైదరాబాద్‌కు చెందిన బీ కృష్ణారెడ్డి దంపతులు రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. విరాళ నగదును ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి స్వాములు, పర్యవేక్షకులు దేవిక, కోమలి, రవికుమార్, హరికృష్ణారెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి అమ్మవార్ల ప్రసాదంతోపాటు చిత్రపటాన్ని అందజేశారు.

శ్రీశైలం ఘంటామఠాల్లో ప్రత్యేక పూజలు

శ్రీశైలంలో అతి ప్రాచీనమైన ఘంటా మఠాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్షేత్ర పరిధిలోని 7వ శతాబ్దం నాటి ఘంటామఠం, భీమశంకరమఠం, రుద్రాక్షమఠం, విభూదిమఠంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా మఠాలకు మరమ్మత్తులు చేశామని, ఇకపై ప్రతి సోమవారం ఘంటామఠాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, అర్చకులు పాల్గొన్నారు.

కొత్తూరు హుండీ లెక్కింపు



కొత్తూరులో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

పాణ్యం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు దేవస్థానం హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ. 25,3, 320 నగదు, 8 గ్రాముల 600ల మిల్లీగ్రాముల బంగారు, 830 గ్రాముల వెండి ఆదాయం చేకూరినట్లు ఈఓ తెలిపారు. మార్చి నెల 28 నుంచి నేటి వరకు రాబడి వచ్చినట్లు తెలిపారు. నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారన్నారు. అలాగే దేవస్థానంలో భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యం, సన్నబియ్యం, లావుబియ్యం విక్రమ బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. సన్నబియ్యం కిలో రూ.34లు, లావు బియ్యం కిలో రూ.18లు, మిశ్రమ బియ్యం కిలో రూ.21ల ప్రకారం అహోబిలానికి చెందిన నాగేషుడు హెచ్చుపాట పాడి సన్నబియ్యం, లావు బియ్యం దక్కించుకున్నాడన్నారు. మిశ్రమ బియ్యాన్ని చంద్రశేఖరరెడ్డి దక్కించుకున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కృష్ణారెడ్డి, అర్చకులు వీరయ్య స్వామి, నంద్యాల సేవాసమితి మహిళలు పాల్గొన్నారు.

కొలనుభారతిలో భక్తజన సందడి

కొత్తపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి పుణ్యక్షేత్రంలో భక్తజన సందడి నెలకొంది. సోమవారం వివిద ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తాదులు సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సప్తశివాలయాల్లో అభిషేకాది క్రతువులు చేయించుకున్నారు. ఆలయ క్షేత్ర ప్రాంగణంలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షర బీజాక్షర క్రతువులు చేయించుకున్నారు. ఆలయ పురోహితులు శ్రీనివాస శర్మ, చక్రపాణి శర్మ, రామయ్యశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి చారుఘోషిణి నదిజలాలచే అభిషేకించి నూతన వస్త్రాలంకరణ అనంతరం ప్రత్యేక పూజాదిక్రతువులు చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కోరారు. సోమవారం సాయంత్రం అమరావతిలోని ముఖ్యమంత్రి నివాసంలో వన్ టూ వన్ కార్యక్రమంలో భాగంగా నారా చంద్రబాబు నాయుడును నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కలిశారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షుడు రణధీర్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్‌ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్దనాగరాజు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు సమ్మె నోటీసును అందజేశారు. డిమాండ్లను నెరవేర్చకపోతే 9 నుంచి సమ్మె చేపడుతామని హెచ్చరించారు.

విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నంద్యాలలో ర్యాలీ చేపట్టారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రఫీ, ఉపాధ్యక్షులు షేక్ సాహీద్‌ల ఆధ్వర్యంలో పద్మావతినగర్ సర్కిల్‌లో ధర్నా చేపట్టి నిరసన తెలిపి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల ఫీజులతో దోచుకుంటున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ విద్యాహక్కు చట్ట ఆదేశాలను ఉల్లంఘనకు పాల్పడుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ధను, బాలు, వినయ్, కిరణ్, హరి, నవీన్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదికి నాలుగు సార్లు డీవార్మింగ్

పాణ్యం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు యేటా నాలుగుసార్లు డీవార్మింగ్ చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కమలాకర్ పేర్కొన్నారు. సామూహిక నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాణ్యం, బలపనూరు గ్రామాలలో గొర్రెలకు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో మండల గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం అధ్యక్షులు చక్రపాణి, ఎంపీటీసీ రంగరమేష్, టీడీపీ జిల్లా కార్యదర్శి రమణమూర్తి, మైనార్టీ టీడీపీ జిల్లా నాయకులు ఖాదర్‌బాషా, మహబూబ్‌బాషా, కృష్ణ, శివశంకరరెడ్డి, గోపాలమిత్ర ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

పాణ్యం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మార్కెట్ యార్డు చైర్మన్ అంగజాల గీత పేర్కొన్నారు. సోమవారం ఆమె చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. యార్డును పరిశీలించి గోదాముల స్థితిగతులను యార్డు కార్యదర్శి రహమాన్‌ను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో 15 వందల టన్నుల సామర్థ్యంతో నిర్మించిన గోదాము నిర్మాణ దశలో ఆగిపోయిందని, త్వరలో గోదాము నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు చేపడతామన్నారు. పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు అంగజాల కృష్ణయాదవ్, సర్పంచ్ రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాస యాదవ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

15 మంది మైనర్లకు జరిమానాలు

నంద్యాల టౌన్ జూన్30(ఆంధ్రజ్యోతి):పట్టణంలో 15మంది మైన ర్లకు రూ.75వేలు జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జరిమానాలు ఒక్కొక్కరికి రూ.5వేలు విధించామన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వద్దని తెలిపారు. ఇలా చేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. 18ఏళ్ల నిండిని వారికి మాత్రమే వాహనాలు ఇవ్వాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్‌ను ఎటువంటి పరిస్థితుల్లో ప్రోత్సహించరాదన్నారు.

డెంగీ మాసోత్సవాలను విజయవంతం చేయండి

నంద్యాల టౌన్ జూన్30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి డెంగీ మాసోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సెంటినర్ హాల్లో మాసోత్సవాలకు సంబంధించి కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఈనెలలో డెంగీ మాసోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు ప్రభుత్వం మూడు పద్ధతులను పాటించాలని చెప్పిందన్నారు. శుభ్రం చేయడం, మూతలు పెట్టడం, అలాగే మలేరియా నివారణకు చర్యల తీసుకోవాలని అధికారులన ఆదేశించారు.

● కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరమని కలెక్టర్ రాజాకుమారి అన్నారు. సోమవారం స్థానిక సెంటినర్ హాల్లో జిల్లా అధికారులతో ఆమె మాట్లాడుతూ.. జూలై 1 వ తేదీ నుంచి డిసెంబర్ 30వ తేదీ వరకుగ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రామలను పటిష్టంగా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన కల్పించాలిని ఆమె అన్నారు. వయో పరిమితి 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వరకు వార్షిక ప్రిమియం రూ.20 చెల్లించాలన్నారు. ఇందుకు ప్రమాద బీమాగా వారికి రూ.2లక్షలు చెల్లిస్తామన్నారు. 18 నుంచి 50 లోపు వారికి వార్షిక ప్రిమియం రూ.436 చెల్లిస్తే వారికి కూడా రూజ2లక్షలు చెల్లిస్తామన్నారు. జన్‌దన్ ఖాతాదారులు తప్పనిసరిగా రి కేవైసీ చేయించుకోలన్నారు. ఈకార్యక్రమంలో జేసీ ,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● రెవెన్యూ శాఖలో హరినాధరావు సేవలు మరువలేనివి అని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం ఆయన పదవి విరమణ పొందిన సందర్భంగా ఈకార్యక్రమానికి ఆమె హజరై మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నో సేవలు అందించి జిల్లా అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. అనంతరం వారి దంపతులకు బహుమతి అందజేశారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా వైద్యుల దినోత్సవం

నంద్యాల హాస్పిటల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బీసీరాయ్ జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి జయంత సమావేశ మందిరంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డా.మధుసూదన్‌రావు అధ్యక్షతన కార్యదర్శి డా.ఫనిల్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ జి.రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం డా.బీసీరాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారిని నంద్యాల వైద్యులు ఘనంగా సన్మానించారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా పలువురు వైద్యులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరుకు చెందిన డా.కోడూరు ప్రభాకర రెడ్డి, నంద్యాలకు చెందిన డాక్టర్లు మురళీధరరావు, శరత్‌చంద్రారెడ్డి, శేష ఫణి, జ్యోతివాణి, ఆశాలత, సరిత, అనిల్, నర్మద, నాగమణి పాల్గొన్నారు.

ఏపీపీకి సన్మానం

నంద్యాల క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీపీగా నియమితులైన ఎస్ఎన్ రాజేశ్వరరెడ్డిని మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం సన్మానించారు. శాలువా, పూలమాలతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గజ్జెల శ్రీనివాసులు, అధ్యక్షుడు కె.పుల్లన్న, ప్రధాన కార్యదర్శి వనం శ్రీనివాసులు, న్యాయవాదులు దబ్బల శంకర్, శింగరి జీవన్‌రాజ్ పాల్గొన్నారు.

'లీజు' పేరిట కన్నేశారు..!

(5వ పేజీ తరువాయి)

ఆ భూములకు సమీపంలో వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి గ్రామం ఉంది. తాతలు, ముత్తాతల కాలం (దాదాపు 70-80 ఏళ్లు) నుంచి ఖాళీగా ఉన్న ఆ భూములను సాగు చేసుకుంటూ పేదలు జీవనం సాగిస్తున్నారు. సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా పాలకులను విన్నవిస్తున్నారు. ఎన్నికల వచ్చిన ప్రతిసారి తమ సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ వచ్చారు. 2005లో అప్పటి ప్రభుత్వం పేదల సాగులో ఉన్న భూములను అసైన్డ్ చేసి అర ఎకరా, ఎకరం, రెండెకరాలు చొప్పున దాదాపు 200 మందికి 276 ఎకరాలు డి-పట్టా ఇచ్చింది. యాజమాన్య హక్కు కల్పిస్తూ పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారు. భూమిపై హక్కు రావడంతో భూమి లేని నిరుపేద కూలీలు ఆనందించారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని బోరుబావులు తవ్వుకున్నారు. కంది, పత్తి, శనగ, వాము.. వంటి పంటలు సాగు చేసుకుంటూ, మిగిలిన సమయంలో కూలీ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. కొందరు రైతులు మామిడి వంటి ఉద్యానవనం తోటలు సాగు చేస్తున్నారు. ఆ భూములు మూడు తరాలు వంశపార్యం పరంగా సాగు చేస్తూ వస్తున్నారు. ముందస్తు వర్షాలు కారణంగా ఈ ఏడాది కూడా ఇప్పటికే వివిధ పంటలు సాగు చేస్తున్నారు.

లీజు పేరిట వాలిన పెద్దలు

ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలకు గుండె దడ పుట్టించే వార్త తెలిసి ఆందోళన చెందుతున్నారు. యాపర్లపాడు రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు 238లో 72 హెక్టార్లు (180 ఎకరాలు) 2004లో ప్రభుత్వం మైనింగ్ లీజు ఇచ్చింది. అయితే 'ఐరన్‌ఓర్ వంటి ఖనిజాలను వెలికితీత పనులు చేపట్టబోతున్నాం.. ఈ భూములు మావి.. ఖాళీ చేయాలి' అని చిట్టి సీతారాముడు అనే వ్యక్తి ఆ భూముల్లో వాలిపోయారని, ఆయన వెనుక పెద్దలు ఉన్నారని పేద రైతులు వాపోతున్నారు. ఇన్నేళ్లుగా సాగులో ఉన్న తమను వెళ్లిపొమ్మంటే ఎలా..? ప్రాణాలైనా వదులుతాం.. భూములు వదులుకోబోమని ఏకరువు పెడుతున్నారు. ప్రభుత్వం 2004లో ఆయనకు మైనింగ్ లీజుకు ఇస్తే.. అదే ప్రభుత్వం 2005లో అసైన్డ్ చేసి అప్పటికే సాగులో ఉన్న తమకు డి-పట్టాలు ఇచ్చిందని, అయితే అప్పుడే ఎందుకు అభ్యంతరం చెప్పలేదని ప్రశ్నిస్తున్నారు. 2004లో లీజుకు తీసుకుంటే ఇన్నాళ్లు ఎందుకు మైనింగ్ చేయలేదని, ఇరభై ఏళ్ల తరువాత వచ్చి 'లీజు' ఉంది.. ఖాళీ చేయాలంటే ఎలా..? ఇది ఎంత వరకు న్యాయం? అంటూ ప్రశ్నిస్తున్నారు. పుల్లగుమ్మి గ్రామస్థులు ఆటోలు, వాహనాల్లో సోమవారం కర్నూలు కలెక్టరేట్‌కు చేరుకుని, తమ భూములు కాపాడి న్యాయం చేయాలని గర్జించారు. ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదికలో జేసీ బి.నవ్యకు ఫిర్యాదు చేయగా, విచారించి మీ భూములు మీకే చెందెలా చూస్తామని హామీ ఇచ్చారని బాధితులు తెలిపారు.

మూడు తరాలుగా సాగులో ఉన్నాం



మా ఊరికి దగ్గల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయి. మా ముత్తాత, తాత, మా నాన్న ఈ భూమిపై ఆధార పడి జీవించారు. ఇప్పుడు నేను సాగు చేసుకుంటున్నాను. 2005లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబరు 238/ఏలో ఎకరం డి-పట్టా ఇచ్చింది. వారసత్వంగా వచ్చిన పట్టా భూమి రెండెకరాలు ఉంది. బోరుబావులు తవ్వకొని వివిధ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. 2004లో ప్రభుత్వం మైనింగ్ లీజు ఇచ్చింది.. ఖాళీ చేసి వెళ్లిపోవాలంటే ఎలా?. ఆ భూములపై బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నాం. **- ఎస్.శ్రీనివాసులు, పుల్లగుమ్మి గ్రామం, వెల్దుర్తి మండలం, కర్నూలు జిల్లా.**

ప్రాణాలు పోయినా భూములు వదులుకోం



ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్నాం. ఆ భూమే మాకు జీవనాధారం. ప్రభుత్వం సర్వే నంబరు 238/ఏలో డి-పట్టా కూడా ఇచ్చింది. మాకు ఉన్నదే ఆరెకరాలు. మాకు లీజు హక్కు ఉంది. వెళ్లిపోండంటే ఎక్కడికెళ్లాలి. మా ప్రాణాలు పోయినా సరే జీవనాధారమైన భూములను మాత్రం వదులుకోం. **- లక్ష్మీదేవి, పుల్లగుమ్మి గ్రామం**

ప్రభుత్వం డి-పట్టా ఇచ్చింది



కూలీకి వెళ్తే తప్ప పూట గడవని పేదరికం మాది. ఊరి పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను మా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ, మిగిలిన సమయంలో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాం. 2005లో ప్రభుత్వం అసైన్డ్ చేసి 2.5 ఎకరాలకు డి-పట్టా ఇచ్చింది. 2004 నుంచి 2060 వరకు ప్రభుత్వం లీజుకు ఇచ్చిందని సీతారాముడు అనే వ్యక్తి వచ్చారు. భూములు లాక్కుంటామంటే అక్కడే ప్రాణాలొదుతాం. కలెక్టర్ మాకు న్యాయం చేయాలి. **- తెలుగు రామచంద్రుడు, పుల్లగుమ్మి**

ఇప్పుడొచ్చి మా భూములు అంటున్నారు



యాపర్లపాడు రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు 238/ఏ1లో 2 ఎకరాలు మా అమ్మ టి.వెంకటమ్మ పేరిట డి-పట్టా ఇచ్చారు. బోరుబావులు తవ్వకొని పంటలు, మామిడి సాగు చేస్తున్నాం. దశాబ్దాలుగా సాగులో ఉంటే.. ఇప్పుడొచ్చి భూములు మావి.. మైనింగ్ లీజు ఉందంటున్నారు. భూములను వదులుకోం. **- టి.జనార్దన్, పుల్లగుమ్మి**

గ్రామసభ పెట్టి చర్చిస్తాం

యాపర్లపాడు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు 1,500 ఎకరాలకు పైగా ఉన్నాయి. సర్వే నంబరు 238/ఏలో అసైన్డ్ చేసి పేదలకు డి-పట్టా ఇచ్చిన మాట నిజమే. సీతారాముడు అనే వ్యక్తి 75 హెక్టార్లు మైనింగ్ లీజు ఉందని మా దృష్టికి తెచ్చారు. గ్రామ సభ ఏర్పాటు చేసి చర్చించి సాగులో ఉన్న రైతులకు న్యాయం చేస్తాం. **- నాగరాజు, తహసీల్దారు, కల్లూరు**

ఎన్‌ఎస్‌టీఆర్‌లోకి నో ఎంట్రీ

- నేటి నుంచి అమలు
- మూడు నెలల పాటు పర్యాటక కేంద్రాలు క్లోజ్
- నల్లమలలో జంగిల్ సఫారీలకు బ్రేక్
- ఇష్టకామేశ్వరీ, రుద్రకోడూరు క్షేత్రాలకు రాకపోకలు బంద్



ఆత్మకూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్‌ఎస్‌టీఆర్) పరిధిలో జనసంచారాన్ని పూర్తిగా నిషేధించనున్నారు. పులుల సంరక్షణకు సంబంధించి ఏ సున్నితమైన అంశాన్ని కూడా దూరదృష్టితో ఆలోచిస్తూ అటవీ అధికారులు ముందుకెళ్తుంటారు. ఈక్రమంలోనే పులుల సంతాన ప్రక్రియకు వర్షాకాల సీజన్ అనుకూలం కావడంతో మూడు నెలల పాటు ఎన్‌ఎస్‌టీ ఆర్‌లోకి ప్రజలు రాకుండా నిషేధిస్తున్నారు.

వేటను మరిచి మమేకం..

పెద్దపులులు జతకలిసే విధానం వైవిధ్యంగా వుంటుంది. ఆడ, మగపులుల మూత్రం వాసనలు భిన్నంగా వుంటాయి. ఈక్రమంలోనే ఎప్పుడైతే ఆడపులి జతకలవాలని కోరుకుంటుందో ఆసమయంలో తన మూత్రవిసర్జనతో మగపులికి సంకేతాలు పంపిస్తోంది. అదే సమయంలో మగపులులు కూడా జతకలిసేందుకు ఉద్వేగంగా ఉండటంతో ఆడపులి మూత్రం సంకేతాలను గమనించి జతకలిసే ప్రయత్నం జరుగుతోంది. ఎప్పుడైతే పులుల మధ్య సంపర్కం మొదలవుతుందో అప్పటి నుంచి మూడు నుంచి ఐదురోజుల పాటు రెండుపులులు వేటను మరిచి సంపర్కంలో మమేక మవుతాయి. ఈవ్యవధిలో సుమారు వందసార్లకు పైగానే పెద్దపులుల ఇష్టంతో సం పర్కం చెందుతాయి. ఇవి జతకలిసే ప్రదేశాలు వీలైనంతవరకు నీటివనరులు వున్న ప్రాంతాలను ఎంచుకుం టాయి. ఉద్వేగంతో జతకలిగిన అనంతరం మగపులి శరీరం బాగా వేడెక్కుతుంది. శరీరాన్ని చల్లబరు చుకునేందుకు అవి నీటిలోకి వెళ్లి సేద తీరుతాయి. ఇదిలా ఉంటే తనివి తీరా జతకలిసిన ఆడపులి మరో కొన్ని నెలల పాటు సంపర్కం చెందేందుకు ఇష్టపడదు.

2023 లెక్కల ప్రకారం..

2023 పులుల లెక్కింపు ప్రకారం భారత్‌లో 3167 ఉన్నట్లు అంచనా వేశారు. వాస్తవానికి జూలై నుంచి సెప్టెంబరు వరకు ఆడపులు లు గర్భం దాల్చేందుకు అనువైన రోజులుగా పరిగణిస్తారు. వీటి గర్భాధారణ సమయం 16వారాలు వుంటుంది. ఒక ఈతలో సుమారు ఒక కిలో గల రెండు నుంచి నాలుగు కూనలకు ఆడపులి జన్మనిస్తోంది. ఇవి గుడ్డిగా, నిస్సహాయంగా జన్మిస్తాయి. దట్టమైన ప్రాంతాలు, రాతిపగుళ్ల వంటి ప్రాంతాల్లో వాటిని ఉంచి ఆడపులులు ఆహార సేకరణకు వెళ్తాయి. పూర్తిస్థాయిలో పులికూనల సంరక్షణ ఆడపులుల పెంపకంలోనే ఉంటాయి. మరణాల రేటు పులుల్లో అధికంగా వుంటుంది. సగం కంటే ఎక్కువ పులులు రెండేళ్ల కంటే ఎక్కువగా బతకలేవని తెలిసింది.

అనుమతుల నిరాకరణ

మూడు నెలల పాటు నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలోని ప్రముఖ పుణక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు కూడా జనానికి అనుమతించరు. ప్రత్యేకించి మార్కాపురం అటవీ డివిజన్‌లోని ఇష్టకామేశ్వరీ అమ్మవారి ఆలయం, వెలుగోడు రేంజ్‌లోని రుద్రకోడూరు క్షేత్రం, గుండ్లబ్రహ్మేశ్వర్యం క్షేత్రాలకు వెళ్లేందుకు అనుమతులను నిరాకరించారు. ఆత్మకూరు డివిజన్‌లోని బైర్లూటి, నంద్యాల డివిజన్‌లోని పచ్చర్ల, మార్కాపురం డివిజన్‌లోని తుమ్మల బయలు ఏకోటూరిజం కేంద్రాలు కొనసాగనున్నప్పటికీ జంగిల్ సఫారీలకు బ్రేక్ వేశారు. ఈసమయంలో కర్ణాటక భక్తులు కొందరు శ్రీశైలానికి అటవీమార్గంలో పాదయాత్రగా వెళ్తుంటారు. అలాంటివారికి అనుమతించమని అధికారులు చెబుతున్నారు.

దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వుఫారెస్ట్‌గా..

దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వుఫారెస్ట్‌గా పేరుగాంచిన నాగార్జునసాగర్ -శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం. నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3727.82 చ.కి. మీలు విస్తరించింది. ఎన్‌ఎస్‌టీఆర్‌లో 2023లో పెద్దపులుల గణాంకాల ప్రకారం 75వుండగా ప్రస్తుతం పులికూనలతో కలిపి 87పులులు ఉన్నట్లు అధికారుల అంచనా వేశారు.

జన సంచారం నిషేధించాం

నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా పులుల ప్రత్యుత్పత్తిలో భాగంగా నాగార్జున సాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో జన సంచారాన్ని పూర్తిగా నిషేధించాం. వర్షాకాలంలో అనుకూలమైన ఈ మూడు నెలల్లో పులులు సంపర్కం చెంది వాటి సంఖ్య వృద్ధి చెందేందుకు అవకాశం ఉంది.
- కృష్ణమూర్తి, ఎఫ్‌డీపీటీ, ఎన్‌ఎస్‌టీఆర్

కందనవోలుది ఘనకీర్తి

(5వ పేజీ తరువాయి)

జిల్లానుంచి విద్యారంగం, రాజనీతిలో ఆర్కాట్ లక్ష్మణ స్వామి మొదిలియార్, ఆర్కాట్ రామస్వామి మొదలియార్ సోదరులు, పారిశ్రామికవేత్తగా ఎమ్మిగనూరు మాచాని సోమప్పలు 1954లో భారత ప్రభుత్వం నుంచి ప్రప్రథమంగా పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. నీలం సంజీవరెడ్డిని రాష్ట్రపతిగా, పీవీ నరసంహారావును ప్రధానిగా దేశానికి పంపించారు. తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య, ఉమ్మడి ఏపీకి రెండు పర్యాయాలు సీఎం బాధ్యతలు చేపట్టిన దివంగత నేత కోట్ల విజయ భాస్కరరెడ్డి, బీహార్, పంజాబ్ గవర్నర్‌గా పని చేసిన పెండేకంటి వెంకటసుబ్బయ్య జిల్లా వాసులేకావడం గర్వ కారణం.

చరిత్రకు సింహద్వారం కర్నూలు

కర్నూలు జిల్లా ఘనచరిత్రకు సింహద్వారం. 167ఏళ్ల చరిత్ర మన సొంతం. ఆదిమానవులు నడియాడిన నేల. అశోకుడి శాసనాలు ఇక్కడ ఉన్నాయి. దేశానికి రాష్ట్రపతి, ప్రధాని, స్పీకర్‌ను, రాష్ట్రానికి ముగ్గురు ముఖ్యమంత్రులను అందించిన జిల్లా కర్నూలు. రాజధానిగా సేవలు అందించి తెలుగుజాతి ఐక్యత కోసం రాజధానిని త్యాగం చేశాం. జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి.. చరిత్రను తరంవాళ్లకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



- ఆచార్య షేక్ మన్సూర్ రహ్మాన్, వ్యవస్థాపకుడు, మానవశక్తి పరిశోధన కేంద్రం,

కర్నూలు త్యాగాలు, పోరాటాల గడ్డ



కర్నూలు జిల్లా ఆవిర్భవించి నేటితో 167 ఏళ్ల పూర్తి చేసుకుంది. ఎన్నో త్యాగాలు, పోరాటలు చేసిన గడ్డ. స్వాతంత్ర్య పోరాటంలో సీమ పౌరుషం ఎలా ఉంటుందో బ్రిటీష్ పాలకులకు చూపించి గడ్డ. జిల్లా చరిత్ర చెరగనిది. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తరువాత కర్నూలు వాసుల చేసిన త్యాగాలు గురించి నేటి పౌరువులకు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా అవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి.
- చంద్రశేఖర్ కల్కూర, వ్యాపారవేత్త, కర్నూలు

నిర్మల చదువుకు సహకారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు కలెక్టరేట్/ ఆదోని రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద కుటుంబాలను ఆదుకోవాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు ప్రారంభించిన పీ-4 కార్యక్రమం కింద నిర్మల అనే విద్యార్థినికి 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ హైదరాబాదు ఉచిత చదువు, వసతి భోజన సదుపాయాలతో మూడు సంవత్సరాల డిగ్రీ, ఐఏఎస్ కోచింగ్‌తోపాటు ఏడాది శిక్షణకు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. సోమవారం జేసీ చాంబర్‌లో హైదరాబాద్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ నిర్మలను అభినందించారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య మాట్లాడుతూ 'పీ-4' కింద దాతలు ముందుకు వచ్చి నిరుపేదలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం విద్యార్థిని నిర్మల మాట్లాడుతూ తన ఉన్నత చదువుకు సహకరిస్తున్న ఎంపీ నాగరాజు, జేసీ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమికి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.



నిర్మలతో ఐఏఎస్ అకాడమి ప్రతినిధులు

కోమాలోకి క్షతగాత్రుడు

చిప్పగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నగరడోణ గ్రామానికి చెందిన గొల్ల రంగస్వామి కోమాలోకి వెళ్లారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనమ మేరకు.. సైకిల్‌పై వస్తున్న గొల్ల రంగస్వామిని గ్రామానికి చెందిన అంజి, అనిల్ అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తూ శనివారం రాత్రి ఢీ కొట్టారు. తీవ్రంగా గాయపడిన రంగస్వామి గుంతకల్లుకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు. అక్కడ కోమాలోకి వెళ్లినట్లు రెండు రోజులు గడిస్తే కానీ ఏ విషయం చెప్పలేమని వైద్యులు అన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

ఆస్పరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైలుపత్తికొండ గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్(35) సోమవారం కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రెండు రోజుల క్రితం పిల్లలను తెర్నెకల్ హాస్టల్‌లో చేర్పించి బైక్‌పై వస్తుండగా కారుమంచి గ్రామ సమీపంలో అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య పార్వతి, కుమార్తెలు, కుమారులు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తుగ్గలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలో జరిగింది. తుగ్గలి మండలంలోని రామలింగాయపల్లెకు చెందిన అంగడి గోపాల్ (49) సొంత పొలం ఎకరన్నరతో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. కంది, సజ్జ, వేరుశనగ, ఆముదం, టమోటా తదితర పంటల సాగు కోసం రూ.8 లక్షలు పైగా అప్పు చేశారు. ఈ అప్పు ఎలా తీర్చాలోనని నిత్యం మనస్తాపం చెందేవారు. ఆదివారం రాత్రి భోజనం అనంతరం నిద్రకు ఉపక్ర మించారు. అయితే సోమవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు నిద్రలో ఉన్న సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగారు. ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా నిర్జీవంగా పడి ఉండడంతో బోరున విలపించారు. జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. గోపాల్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



అంగడి గోపాల్(ఫైల్)

రూపనగుడిలో వృద్ధురాలు..

ఉయ్యాలవాడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విష ద్రావణం తాగి ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని రూపనగుడిలో చోటుచేసుకున్నట్లు ఏఎస్ఐ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. జగ్గమ్మ(75) రూపనగుడిలో నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఓకుమార్తెను మాయలూరు గ్రామానికి, మరో కుమార్తెను రుద్రవరం మండలం, ఆర్.నాగులవరం గ్రామాల్లో వివాహం చేశారు. కూతుర్లు తనను చూడటానికి రాలేదని మనస్థాపానికి గురై సోమవారం విష ద్రావణం నీళ్లలో కలుపుకొని ఆత్మహత్య చేసుకుంది. వాంతులు చేసుకుం టుండగా మనవడు ఓబులేసు గుర్తించి 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు జరిపి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె కుమారుడు పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వజ్రం లభ్యం?

మద్దికెర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామంలో ఓ వ్యవసాయ కూలీకి వజ్రం దొరికినట్లు సమాచారం. బసినేపల్లిలో ఓ రైతు పొలంలో సోమవారం కలుపు మొక్కలు తొలగించే పనులకు కూలీలు వెళ్లారు. కలుపు మొక్కలు తొలగిస్తుండగా వజ్రం దొరికినట్లు తెలిసింది. ఆ వజ్రం బరువు 3 క్యారెట్లు ఉన్నట్లు సమాచారం. పెరవలి గ్రామనికి చెందిన వ్యాపారి రూ.2 లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ రద్దుకు పోరాడదాం

- తెలంగాణ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ



కర్నూలు న్యూసిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ముస్లింలందరూ ఐకమత్యంతో కలిసికట్టుగా పోరాడి వక్ఫ్ బోర్డు చట్ట సవరణను రద్దు చేసుకుందామని తెలంగాణ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారు. సోమవారం ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు సేవ్ వక్ఫ్ సేవ్ కాన్సిటెన్సీ జేఏసీ ఆధ్వర్యంలో ఎస్టీబీసీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ మౌలానా షోయబ్ సాబ్ అధ్యక్షతన జరిగింది. సభకు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు అధ్యక్షుడు ఖాలీద్ షఫీఉల్లా రహమాని, జమా అతే అహలే హదీస్ అధ్యక్షుడు అబ్దుల్ రహిం ఖురామ్ హాజరయ్యారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు అధ్యక్షుడు ఖాలీద్ షఫీఉల్లా రహమాని మాట్లాడుతూ ముస్లిం సమాజం ఇతర ప్రజలను దళితులను, మైనార్టీలను, సెక్యులర్ వాదులను, రాజ్యాంగ ప్రేమికులను, న్యాయ నిపుణులను, కలుపుకుని ఐక్యంగా పోరాడాల్సిన ఆవశ్యకత ఉంద న్నారు. సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. ముస్లిం హక్కులను కాలరాసే విధంగా చట్టాలను తీసుకువస్తుందన్నారు. ఈ దేశంలో ముస్లింలు తక్కువ జనాబా కలిగి ఉన్నారనే భావనను తొలగించుకోవాలని ఒక ఇరాన్, పాకిస్తాన్ కంటే కూడా ఈ దేశంలో ఎక్కువ మంది ముస్లిం సోదరులు ఉన్నారని అన్నారు. ఢిల్లీలో రైతులు చేసిన ఆందోళనలకు ప్రధాని నరేంద్ర మోదీ మూడు చట్టాలను రద్దు చేసి అందరికీ క్షమాపణ చెప్పిన విషయాన్ని అందరూ గుర్తు చేసుకోవాలన్నారు. సభలో జావలి సాహెబ్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్., సయ్యద్ షా ఫషీ ఫాషా సాహెబ్, ముక్తి సయ్యద్ మన్సూర్ సాహెబ్, ఎస్డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఖాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ల నియామకం


కుమార్ రెడ్డి,


లక్ష్మీకాంత రెడ్డి


గువ్వల సుబ్బారెడ్డి


చిన్న సుబ్బారెడ్డి


ఏవీ సుబ్బారెడ్డి

బనగానపల్లె/కోవెలకుంట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీ చైర్మన్ల, డైరెక్టర్లను తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. బనగానపల్లె మండలం నందవరం సొసైటీ చైర్మన్‌గా నందవరానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు పీవీ.కుమార్‌రెడ్డి, డైరెక్టర్లుగా పసుపులకు చెందిన ఆకుల షేక్షావలి, ఎస్.మహేశ్వర రెడ్డిలను నియమించింది. అలాగే టంగుటూరు సొసైటీ చైర్మన్‌గా లక్ష్మీకాంతరెడ్డి, డైరెక్టర్లుగా వెంకటసుబ్బయ్య, సుదర్శన్‌రెడ్డి, అలాగే భానుముక్కల సొసైటీ చైర్మన్‌గా అత్తార్ పూలకలాం, డైరెక్టర్లుగా ఎర్రబోలు పవన్‌కుమార్‌రెడ్డి, రాముడు నాయక్, కోవెలకుంట్ల సొసైటీ అధ్యక్షుడిగా గువ్వల సుబ్బారెడ్డి, డైరెక్టర్లుగా దూదేకుల హుసేని, సుదర్శన్‌రెడ్డి, లింగాల సొసైటీ చైర్మన్‌గా ఏవీ.సుబ్బారెడ్డి, డైరెక్టర్లుగా యు.రమాదేవి, భూపాల్‌రెడ్డి, పెద్దకొప్పెర్ల సొసైటీ చైర్మ న్‌గా జి. మహేశ్వరరెడ్డి, డైరెక్టర్లుగా బాలరాజు, శివశంకర్‌రెడ్డిలను నియమించారు. భీమునిపాడు సహకార సంఘానికి కంపమల్ల సూర చిన్న సుబ్బారెడ్డిని నియమించింది. వీరు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. సొసైటీ అధ్యక్షులుగా నియమించిన సీఎం చంద్రబాబు నాయుడుకు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి, కృతజ్ఞతలు తెలిపారు.

పూల తోట పరిశీలన

చాగలమర్రి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో పక్రుద్దిన్ అనే రైతు సాగు చేసిన పూలతోటను హార్టికల్చర్ అధికారి ఫరూక్ పరిశీలించారు. 'గొర్రెలకు వదిలేశారు' అన్న శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉద్యానశాఖ అధికారి దస్తగిరి పర్యవేక్షణలో సోమవారం పరి శీలించారు. వైరస్ నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పరిహారం కోసం నివేదికలను ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తామని, ఉద్యానశాఖ ద్వారా రాయితీ అందిస్తామని వారు తెలిపారు.

డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

డోన్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): డోన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పట్టణం వెలుపలకు తరలిస్తే వాటిపై ఆధారపడిన డాక్యుమెంటు రైటర్లు, టైపిస్టులు ఉపాధి కోల్పోతారని డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపును వ్యతిరేకిస్తూ సోమవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రధాన రోడ్డులో డాక్యుమెంటు రైటర్లు తలపెట్టిన రిలే దీక్షలకు వైసీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జిల్లా వలంటరీ విభాగపు అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, వైసీపీ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోకపోతే ఉద్యమమే

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు


రామ్‌కో పరిశ్రమ వైపు వెళ్తున్న సీపీఐ నాయకులు, రైతులు

కొలిమిగుండ్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రామ్‌కో సిమెంట్ పరిశ్రమ కారణంగా నష్టపోయిన బాధిత రైతులను వచ్చే వారంలోగా ఆదుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు హెచ్చరించారు. సోమవారం మండల రైతు సంఘం అధ్యక్షుడు పుల్లయ్య, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి భాస్కరరావు, సీఐటీయూ భాస్కరరావు, బాబాఫక్రుద్దీన్, సుంకయ్య తదితరుల ఆధ్వర్యంలో స్థానిక రైతులతో కలిసి రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ముట్టడి ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. రైతులు రామ్‌కో సిబ్బంది, పోలీసుల మధ్య వాగ్వాదం నెలకొంది. అనంతరం ప్రధాన గేటు వద్ద బైఠాయించి, వాహనాల రాకపోకలను అడ్డుకొని ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో రామ్‌కో పరిశ్రమ పూర్తిగా విఫలమైందన్నారు. సీఐ రమేష్‌బాబు చొరవతో పరిశ్రమ జీఎం రవికుమార్ వచ్చి రైతులతో మాట్లాడారు. నాయకులు రంగనాయుడు, బాలకృష్ణ, సుబ్బారెడ్డి, మహేష్, సూర్యనారాయణ, బేతంచర్ల, తాడిపత్రి మండలాల సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వేణుగోపాలా.. ఇంకెన్నాళ్లీ నిరీక్షణ

- నూతన ఆలయ నిర్మాణానికి ఎదురుచూపులు
- గుప్తనిధుల వేటలో పురాతనఆలయం ధ్వంసం
- మాన్యం భూములున్నా అభివృద్ధికి నోచుకోని వైనం
- ప్రస్తుతం కౌలు వేలంలో రూ3.10లక్షలు ఆదాయం

రుద్రవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరవోలు సమీపంలో వేణుగోపాల స్వామి నూతన ఆలయ నిర్మాణానికి మోక్షమెప్పుడో అని భక్తులు పేర్కొంటున్నారు. ఈ దేవాలయం నిర్మిస్తే పూజలు చేయాలని గ్రామస్థులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం.. అక్కడి ప్రజలకు శాపంగా మారింది. దేవాలయ నిర్మాణానికి గ్రామంలో స్థల సేకరణ కూడా (సుమారు పది సెంట్లు) చేశారు. కానీ ఎక్కడో నిర్లక్ష్యం ఉండడంతో ప్రజలకు పూజ చేసేందుకు కూడా దేవుడు దూరమయ్యాడని విమర్శలున్నాయి. ఆ దేవుళ్లకు మాన్యం భూములున్నా నూతన దేవాలయ నిర్మాణానికి గ్రహణం ఏర్పడింది. బీరవోలు వేణుగోపాల స్వామి ఆలయానికి రుద్రవరం, మహానంది, నంద్యాల మండలాల్లో మాన్యం భూములు ఉన్నాయి. 42 సర్వేనెంబరులో 10.82, 170లో 4.50, 281లో 7.02, 241/1లో 2.39 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి.


గర్భగుడిలో పెకలించిన వేణుగోపాలస్వామి విగ్రహం


అమ్మవారి విగ్రహం


ధ్వంసమైన విగ్రహాలు


బీరవోలు సమీపంలో శిథిలమైన పురాతన వేణుగోపాలస్వామి ఆలయం

వేటగాళ్లు పెకిలించారు..

పురాతన ఆలయం, విగ్రహాలు గుప్తనిధుల వేటగాళ్ల దాడిలో శిథిలయ్యాయి. ఈ ఆలయం పడమటి ముఖంతో నిర్మాణం చేపట్టారు. ఆలయంలో ప్రధానంగా గా వేణుగోపాలస్వామి విగ్రహాన్ని గుప్తనిధుల వేటగాళ్లు పెకలించారు. మిగిలిన విగ్రహాలను ధ్వంసం చేశారు.

ఈ సారి వేలంలో..

గత ఏడాది మే 18న వేలం నిర్వహించారు. రూ.2లక్షలా 80వేలు ఆదాయం వచ్చింది. 2025 మే 20న మాన్యంభూములకు కౌలు వేలం నిర్వహించారు. ఈవేలంలో రూ.3.10 లక్షల ఆదాయం వచ్చింది. వచ్చిన ఆదాయాన్ని ధూపదీప నైవేద్యాలకే ఖర్చు చేస్తున్నారే తప్ప దేవాలయాన్ని అభివృద్ధి చేయకపోవడం గమనార్హం.

ఆదాయం ఏమైనట్లు?

బీరవోలు వేణుగోపాలస్వామి ఆలయం భూములకు ప్రతి యేటా వేలం పాటలు నిర్వహిస్తున్నారు. వేలం పాటల్లో వచ్చిన ఆదాయం ఏం చేస్తున్నారన్న విమర్శలు న్నాయి. దేవాలయం చూస్తే శిథిలమైంది. విగ్రహాలు దెబ్బతిన్నాయి.

నిర్మాణానికి చర్యలు

బీరవోలు పురాతన వేణుగోపాల స్వామి ఆలయం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం, ఈ విషయాన్ని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో నిర్మాణం చేపడతాం.

● రామాంజనేయశర్మ, ఈవో

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

డోన్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): డోన్ ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం అన్నారు. సోమవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు మండలంలోని సీహెచ్ మల్యాపురం-2 (బీసీ-సీ), తిరునాంపల్లిలో (ఈడబ్ల్యూఎస్), ప్యాపిలి మండలం ఊటకొండలో-2 (బీసీ-డీ), జక్కసానికుంట్లలో (బీసీ-ఏ), బేతంచెర్లలో-12 (ఓసీ జనరల్), సిమెంటు నగర్‌లో-3 (ఎస్సీ-గ్రూప్-1)లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ నెల 10లోగా సంబంధిత దరఖాస్తు ఫారాలను సమర్పించాలన్నారు.

వృద్ధుల ఇంటి వద్దకే రేషన్

చాగలమర్రి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో వృద్ధులు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌ల గృహాల వద్దకు వెళ్లి డీలర్లు రేషన్ పంపిణీ చేశారని ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 1,727మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారని, వారందరికి డీలర్లే ఇంటివద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు అందజేస్తారన్నారు.

సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ముత్యాలపాడు ఆరోగ్య కేంద్రంలో వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా వ్యాధులపై అప్రమత్తంగా ఉండా లన్నారు. అతిసారాపై నిర్లక్ష్యం చేయరాదని, విరేచనాలు అధికమైతే వైద్య చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

డోన్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్‌జో ఇంగ్లిష మీడియం పాఠశాలలో ప్రైవేటు డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు అసోసియేషన్ నాయకులు ఈర్లదిన్నె శ్రీధర్, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వర్షం కోసం నేలబిలంలో జలాభిషేకం


స్వామివారిని అభిషేకిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, అర్చకులు

కొలిమిగుండ్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నేలబిలం మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వర్షంకోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మేన్, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో బందార్లపల్లె గ్రామానికి చెందిన భక్తులు జలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని బిలంలోని పవిత్ర జలాలను తీసుకువచ్చి మల్లేశ్వరస్వామికి అభిషేకం చేశారు. 108బిందెల నీటితో, వేద మంత్రోచ్ఛరణాల మధ్య, భక్తి శ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు.

డ్రైనేజీలు శుభ్రం చేయించండి

● కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ చలంరెడ్డి


సమావేశంలో చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ హరిప్రసాద్

బేతంచెర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని ఆయా వార్డుల్లో ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి ఆదేశించారు. అలాగే 800 మీటర్లలో ఉన్న రోడ్డులో ఎనిమిది స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ల సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన కమిషనర్ హరిప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనుల ఆమోదం కోసం అజెండాలను సభ్యులకు చదివి వినిపించారు. వైస్ చైర్మన్ పర్వీన్ మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల రోడ్ల సర్కిల్‌లో వెల్కమ్ టూ బేతంచర్ల బోర్డు ఏర్పాటు చేయడానికి రూ.ఐదులక్షలు ఎందుకు ఖర్చు అవుతుందని ప్రశ్నించారు. కౌన్సిలర్ ఇబ్రహీం ప్రధాన రహదారి వెంట పైపు లీకేజీ, వాటి వల్ల గుంతల ఏర్పాటు చేయడం, వాటిని పూడ్చడం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుపగా, త్వరలోనే మరమ్మతులు చేపడుతామని చైర్మన్, కమిషనర్ సమాధానం ఇచ్చారు. వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బుగ్గానపల్లె పాఠశాల సమీపంలో వాటర్ ట్యాంకు వద్ద డ్రైనేజీ కాలువలను మరమ్మతులు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే కౌన్సిలర్ మధు మాట్లాడుతూ డ్రైనేజీలు కూడా శుభ్రం చేయడం లేదని, దోమలు అధికమయ్యాయని తెలిపారు. ఇలా వార్డు కౌన్సిలర్ ఆదిలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు ఎల్లయ్య, వార్డు కౌన్సిలర్ దస్తగిరమ్మ పలు సమస్యలను సభాదృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎస్ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'తల్లికి వందనం' కోసం నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న అంగనవాడీ వర్కర్లు

ప్యాపిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్లు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు వర్కర్లు మాట్లాడుతూ తాము చాలీచాలని వేతనాలతో కాలం గడుపుతున్నామన్నారు. తమకు వచ్చే వేతనాలతో పిల్లలను చదివించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ గోడును ఆలకించి తల్లికి వందనం వర్తింపజేయాలని వారు కోరుతున్నారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసరావుకు వర్కర్లు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్కర్లు నీరజ, విజయకుమారి, ఫర్హాన, నాగమణి, విజయకుమారి పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌వీఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్‌వీఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు తహసీల్దార్లు ఎంపీడీవోలకు వినతి పత్రం అందజేశారు. ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్ర ధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్, ఏపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగ సురేంద్ర యాదవ్, రాజు, వెంకి, మనోహర్, చంద్ర, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘనసన్మానం


జయరామిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొలిమిగుండ్ల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు జయరామిరెడ్డి సోమవారం పదవీ విరమణ చేశారు. దాంతో తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సుదీర్ఘ కాలంగా మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తూ సేవలందించడంతో పలువురు అభినందించారు. ఉపాధ్యాయులు రమణయ్య, బాబాయ్య, అరుణ, జ్యోతి కొండప్ప, రవిశంకర్, సంజీవ రాయుడు, చంద్రప్రభావతి సుజాత, జానకీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

దొర్నిపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని దివ్యాంగులు, వృద్ధులు పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సావిత్రి తెలిపారు. ఆమె మాట్లాడుతూ మంగళవారం ఆళ్లగడ్డ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పరికరాల పంపిణీ కోసం శిబిరం ఏర్పాటు చేశారన్నారు. అర్హులైన వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు: ఎమ్మెల్యే


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేసిన పాపాలను కడిగి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం ఆళ్లగడ్డలోని శోభానాగిరెడ్డి కాలనీలో టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ 52 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, కౌన్సిలర్ హుసేన్ బాష, నక్కలదిన్నె శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ సభ్యులతో సమావేశం..

ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమానికి సిద్ధం కావాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సూచించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు ఈ నెల 2నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ప్రభుత్వ పథకా లను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో తాలుకా నాయకులు భార్గవ్‌రామ్, వివిధ మండలాల బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

రుద్రవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్ఎండీ రఫీ తెలిపారు. వివరాలిలా.. రుద్రవరం మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన వెంకటరాముడు(56) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో కోలుకోలేక జూన్ 29న మృతిచెందాడు. మృతుడి కూతురు అన్నపురెడ్డి కుమారి తన తండ్రి మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మిగులు భూమిపై సర్వే చేయండి

డోన్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న మిగులు భూమిని సర్వే చేసి కాలనీ అభివృద్ధికి కేటాయించాలని స్థానికులు ఈ శ్వరయ్య మాదిగ, రంగనాయకులు, బాలరంగడు కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో కార్యాలయ ఏవో అంజన్ బాబుకు వినతి పత్రం అందజేశారు.

కార్మికలకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

బేతంచెర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం హమాలీ కార్మికులకు సంక్షేమ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అయ్యలచెరువు లోడింగ్ హమాలీ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎల్లయ్యతో పాటు రామాంజనేయులు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చిందని, వెంటనే ఆ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు ప్రతి కార్మికుడు హాజరై జయప్రదం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

డోన్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులైఖ అన్నా రు. సోమవారం కొచ్చెర్వులో అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్ వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న దేశవ్యాప్త స మ్మెను విజయవంతం చేయాలని కోరారు.

ఐదుగురు కానిస్టేబుళ్ల బదిలీ

కొలిమిగుండ్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్ నుంచి నలుగురు కానిస్టేబుళ్లు బదిలీ అయినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సోమవారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణనాయక్ అవుకుకు బదిలీ కాగా, సుబ్బరాయుడు, సుధీర్ ఉయ్యాలవాడకు, సునీల్ కుమార్‌రెడ్డి నంద్యాలకు, ఇలియాజ్‌బేగ్ బనగానపల్లెకు బదిలీ అయినట్లు తెలిపారు.

గుడి ఆవరణలో అక్రమంగా బోరు


మైనింగ్ వ్యాపారి అక్రమంగా వేసుకున్న బోరు

ప్యాపిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఓమైనింగ్ వ్యాపారి దౌర్జన్యానికి పాల్పడ్డారు. గుడి ఆవరణంలో బోరు వేసి తద్వారా తమ పరిశ్రమకు నీరు తరలిస్తున్నారు. వ్యాపారి దౌర్జన్యాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గొల్లపల్లి బుగ్గ పుణ్యక్షేత్రంలో ప్రసిద్ధ శివాలయం ఉంది. ఈ ఆలయం ఆవరణలో ఓమైనింగ్ వ్యాపారి మూడు నెలల క్రితం ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా బోరువేశాడు. అక్కడనుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పరిశ్రమకు పైపు లైన్ ద్వారా నీరును తరలిస్తున్నారు. బహిరంగంగా వ్యాపారి దౌర్జన్యానికి పాల్పడుతున్న అధికారులు పట్టించుకోక పోవడంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక అధికారుల పట్టించుకోని పక్షంలో ఈ మైనింగ్ వ్యాపారి అక్రమ బోరు వ్యవహారన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షులు దామో దర నాయుడుతో పాటు భక్తులు తెలియజేస్తున్నారు. కాగా అక్రమ బోరుపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు.

బోరు వెంటనే తొలగించాలి

మైనింగ్ వ్యాపారి ఎటువంటి అనుమతులు లేకుండా శివాలయం ఆవరణలో బోరు వేశారు. బోరు వ్యవహారాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా వేసిన బోరును తొలిగించడంతో పాటు సదురు వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి.

\- కేసీ మద్దిలేటి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జలదుర్గం, ప్యాపిలి మండలం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

శిరివెళ్ల, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చింతమాను మలుపు సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన రాఘవేంద్ర(36) అనే వ్యక్తి కుటుంబసభ్యులతో కలిసి గిద్దలూరు నుంచి నంద్యాలకు కారులో వస్తుండగా మార్గమధ్యంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు పక్కన ఉన్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా కోలుకోలేక అక్కడ మృతిచెందాడు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని ..


ఉషారాణి

రుద్రవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందింది. ఈఘటన సోమవారం రుద్రవరం మండలం ఎల్లావ త్తుల గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఉషారాణి (14) 9వ తరగతి చదువు తోంది. తలనొప్పిగా ఉందని చెప్పడంతో తల్లి స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లింది. వైద్యం చేస్తుండగా పడిపోయింది. దాంతో నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు, అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెం దింది. పాఠశాలలో చురుకుగా ఉండే విద్యార్థిని మృతి చెందడంతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.